# కొత్త ఇల్లు

## —ద్వారకా

"ఇన్ని సంవత్సరాలు అన్ని ఊళ్ళలో ఉన్నాము. ఒక్క రొక్క మాట అన్నారా మమ్మల్ని! అసలు గట్టిగా ఎవరితోనన్నా మాట్లాడి ఎరుగుదుమా?

"తనకు డబ్బుంటే ఎనిమిదిసార్లు తిని, పదహారు సార్లు దొడ్లోకి తిరగమను. తన కుందిగదా అని ఇతరుల్ని చులకనచేసే రోజులు పోయాయని ఆవిడగారికి తెలీదు గాబోలు ఇంకా.

"అసలు మామీద ఇల్లిల్లూ పని గట్టుకొని తిరిగి లేనిపోనివన్నీ కల్పించి చెప్పట మెందుకు? అదేం వెధవవని?

"ఈవిడగారి కుమార రత్నం పరీక్ష పాసయేందుకు మా ఆయన కాపీ లందించాలా? ఆయనకు కుర్చీలో కూచోని జీతం తీసుకోవటం తప్ప చదువు చెప్పటం చేతకాదా! గాడిదకు గంధం పొడి వాసనేం తెలుస్తుంది? ఆయన చదు వేమిటో గంగిరెద్దులా బట్టలేసుకు తిరిగే ఈవిడకేం తెలుస్తుంది—ఈవిడ పెట్టుమారి మొగుడుకేం తెలుస్తుంది.

"తానే మమ్మల్ని పోషిస్తున్నట్లు వీధి వీధి తిరిగి చెప్పుకుంటుందా! వెధవ నోరు, వెధవ బుద్ధులు."


"నాకు బుద్ధిలేక చేరా నీ ఇంట్లో. ఇక ఒక్క క్షణం ఇక్కడ ఉండ బుద్ధి కావటం లేదు. ఛ ఛ! ఇంత జరిగిన తరువాతకూడా ఎలా ఉండటం? ఇలాంటివాళ్ళ భవనాలకంటె పూరి పాకలు లక్ష రెట్లు మేలు. వాళ్ళకు గౌరవం ఇవ్వటం తెలుసు,తీసుకోవటం తెలుసు..."

సాయంత్రం అయిదు గంటలకు ఇంటికొచ్చేసరికి ఉరుములు మెరుపులు.

నన్ను చూస్తూనే పద్మ కళ్ళు నీళ్ళ పర్యంతమైంది. "మనం ఈ ఇల్లు తక్షణం ఖాళీచేసి వెళ్ళిపోదామండీ. సామాన్లుకూడా సర్దేశాను. ఏ పూరి కొంపయినా నరే... మీరు వెంటనే మాట్లాడెయ్యండి పోదాం" అంటూ దీనంగా నా ముఖంలోకి చూచింది.

"నువ్వేకదా కావాలని ఏరికోరి చేరావు. చేరిందాకా ఆ తొందర. ఇవ్వు డీ తొందర. మనం అనుకోగానే ఇళ్ళు దొరుకుతాయా. కాస్త వ్యవధి పడుతుంది. అయినా, ఈ ఇంటికేం నిక్షేపంలా ఉందిగదా!" అన్నాడు.

"బంగారవు వర్షమే కురుస్తున్నా మనల్ని ఆదరించని చోట మనం ఉండకూడ దన్నారు. ఇది



మనం ఉండదగిన చోటు కాదండీ. వెళ్ళిపోదాం. ఎక్కడున్నా ఇంత గౌరవంగా ఉన్నాం కాని, ఇలా ఎవరిచేతా పేర్లు పెట్టించుకోలేదు. మెరిసేదంతా బంగారం కాదని ఇప్పుడు తెలుసుకున్నాను. క్షణం ఇక్కడ ఉండ బుద్ధి పుట్టటంలేదు. చేసిన తప్పుకు లెంపలు వాయించుకుంటాను. దయచేసి వెంటనే మరో ఇల్లు చూడండి." ఎంతో ఆవేదనతో, ఆవేశంతో అంటున్నది పద్మ.

ఇంటావిడతో సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం ప్రత్యక్షరూపం దాల్చిందన్న మాట.

** ** **

పద్మ పుట్టింది పట్నంలో అయితే ,నేను పుట్టింది మహాపట్నంలో!

నాన్న ప్రయివేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేసి ఎలాగో దాటిపోయాడు. ఆయన బ్రతికినన్ని రోజులూ అద్దె కొంపలోనే గడిపేశాడు. రెక్కల్ని నమ్ముకొని ఆ పూట కాపూట గడిస్తే చాలునని జీవికలు సాగించే బడుగు జీవులకు సొంత ఇళ్ళెలా సమకూరుతాయి! మాతాత ముత్తాతల ఐశ్వర్యాల గురించిన కథలయినా వినలేదు నేను. తరతరాలుగా మా జీవితా లిలాగే సాగుతున్నాయి.

అమ్మకు విద్యాగంధం లేదు. పతియే ప్రత్యక్ష దైవమని నమ్ముకొని ఆయన కూర్చోమంటే కూర్చోని, నించోమంటే నించొని కాలం గడిపింది. నాన్నను ఎన్నడూ తప్పుపట్టలేదు మహాతల్లి.

సంతానాన్ని ఇబ్బడి ముబ్బడిగా కనేందుకు అమ్మా ,నాన్నలకు తీరిక ఉండేది కాదు. ఆయనకు షావుకారును సంతోష పెట్టాలనే తపనతో తీరికలేని పని. అమ్మ పూజలు, వ్రతాలు, ఉపవాసాలతో పుణ్యలోకాలను పునిస్త్రీగా చేరుకోవాలని శక్తి వంచనలేకుండా కృషిచేస్తూ ఉండేది. ఏ ప్రచారమూ లేకపోయినా అక్కయ్య, నేను ఇద్దరమే పిల్లలం.

మనిషికి నియంత్రణ కావాలంటే ఉన్నతమయిన ఆశయాలు ఉండాలనుకుంటాను. ఆశయాలు లేని వాడు సూత్రం తెగిన గాలిపటంలాంటివాడు. అది ఎక్కడయినా వాలవచ్చు. ఒక గమ్యం, లక్ష్యం దాని కుండవు.

అక్కయ్యను ఆ ఊళ్ళోనే మరో షావుకారు ఉద్యోగం చేసుకునే అతనికిచ్చి పెళ్ళిచేశాడు నాన్న. ఉన్నంతలో గుట్టుగానే సంసారం చేసుకుంటున్నారు వాళ్ళు.

అమ్మ నోచుకున్న నోములు పండి ఆమె పునిస్త్రీగానే ఇహలోక యాత్ర చాలించింది. ఆవిడ పోయిన మరో నాలుగేళ్ళకు నాన్నకూడా పరమపదం చేరుకున్నాడు. అప్పటికి నా వయస్సు పదహారు సంవత్సరాలే!

పట్నంలో ఉన్నందువల్ల ఎ స్సెల్సీ వరకన్నా చదువుకున్నాను. నాన్న పోయిం తరవాత నా గురించి శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం బావగారి మీద పడింది. ఎలాగో నన్ను టీచరు ట్రయినింగుకు పంపించా డాయన. ట్రయినిం గయిన కొద్దికాలానికే నాకు ఉద్యోగం దొరికింది.

ఒక మారు మూ ల పల్లెటూళ్ళో ఉద్యోగంలో జాయినయినాను.

మన పల్లెలది గత వైభవమే కాని వర్తమానంలో చెప్పుకునేందుకు దరిద్రం తప్ప మరోటి ఉండదు. చాలా పల్లెలకు బస్సు సౌకర్యం ఉండదు. ఊరు చేరేందుకు మూ డు నాలుగు మైళ్ళయినా నడవాల్సి ఉంటుంది. ఆరోగ్య వసతులు బొత్తిగా ఉండవు. కరెంటు దీపాలు, కాఫీ హొటళ్ళు, సినిమాహాళ్ళు అపురూపమైన వస్తువులు. ఆధునికతకు పల్లెటూళ్ళల్లో ఉండే మానవుడికి మధ్య చాలా దూరం.

పల్లెలో స్కూలు పెట్టారికానీ ఆ స్కూలుకు భవనం ఉండదు. ఏ చెట్టుక్రిందో, గుట్టక్రిందో బడి. బడికే భవనం లేకపోతే బడి పంతులకు ఎక్కడనించి వస్తాయి! మానవతా భావంతో ఏ గొడ్లకొట్టమో కాస్త బాగుచేసి పంతులుగారు ఉండెందు కిస్తారు.

నా శ్రీమతి పుట్టింది చిన్న పట్నంలో. పెరిగిందికూడా అక్కడే. ఆ ఊళ్ళోనే ఏడోతరగతి చదివి పాసయింది. వాళ్ళు మాఅంత బీదవాళ్ళు కాదు. స్వంత ఇల్లు ఉంది వాళ్ళకు. జరుగుబాటుకు తక్కువేంలేదు.

నేనేదో ఉద్యోగం వెలగ బెడుతున్నాను కాబట్టి, తిండి తిప్పలకు అవస్థపడకుండా ఉండేందుకు నాకు ఉద్యోగం వచ్చి న సంవత్సరంలోపలే బావగారు నాకు పెళ్ళి చేశారు. దాంతో నా జీవిత భాగాస్వామిని అయింది పద్మ.

ఆడపిల్లలు కన్నె కలలు కంటూ ఉంటారు. ఆ కలలకు చాల రంగులు, హంగులు చిత్రిస్తున్నాయి సినిమాలు, నవలలు. పద్మ వాటికి అతీతురాలేం కాదు.

పెళ్ళయిం తరువాత కాపురానికి మూ డు మైళ్ళు బస్సు దిగి నడిచి వచ్చింది. పూరి పాకలో సంసారం. రెంటినీ అసహ్యించుకున్నది పద్మ. తక్కువగా చదువుకున్నందువల్ల, పతివ్రతా ధర్మాలు కొంతకు కొంత వంటబట్టించుకున్నందువల్ల కష్టమైనా ఇష్టంగానే నన్ను భరిస్తూ ఉన్నది. మరొకరు మరొకరు అయితే మంగళసూత్రం నా మెడకే తగిలించి తన దారి తాను చూచుకుని ఉండేవాళ్ళు.

నాకు విధిలేదు. అందుకే బాధే సౌఖ్యమనే భావనతో నిశ్చలానందాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటున్నాను. ఇంటితోను, ఇంటి పరిసరాలతోను తాదాత్మ్యం పొందాల్సింది ఇల్లాలే. మగవాడు ఇంట్లో కూచుంటే ఎలా? ఆడది తిరిగి చెడితే, మగవాడు తిరక్క చెడతా డన్నారు పెద్దవాళ్ళు.


పద్మకూడా విసుగు పుట్టినప్పుడు ఇరుగుపొరుగమ్మలక్కలతో కాలక్షేపం చెయ్యవచ్చు. కాని వాళ్ళకు ఎప్పుడూ ఏవో పనులు. పైగా పద్మపాటి చదువు వచ్చిన వాళ్ళుకూడా కలికాని కయినా కనిపించరు. ఈవిడగారు కాస్త శుభ్రమైన బట్టలేసుకుంటే వాళ్ళకు కళ్ళల్లో కారం చల్లుకున్న ట్లుంటుంది. "మీకేమమ్మా! మహారాజులు. నెల తిరక్కుండానే జీతం వచ్చి పడుతుంది. మా కలా కాదే" అంటూ ఉంటారు. అందువల్ల వాళ్ళతో మాట్లాడేందుకే భయం పద్మకు. వాళ్ళ మాటల్లో యదార్థం లేకపోలేదు.

గ్రామంలో మోతుబరులు లేరా అనవచ్చు. ఉంటారు ఏ కొద్దిమందో. వారి స్టేటసే పెద్దది. అధికారాల్లో ఉంటారు వాళ్ళు. చిన్న చిన్న వాళ్ళు వారి చూపుల కందరు. వాళ్ళ రాజకీయాలు, ప్లాన్లు, ఎత్తులు, పైఎత్తులు వాళ్ళవి. మనతో అవసరం లేకపోతే మనల్ని దగ్గరికి చేర్చరు. పైగా పద్మలాంటి పరిశుభ్రమైన వాళ్ళు వాళ్ళ కంటబడితే పులికి లేడిపిల్ల దొరికినట్లే. నానా కష్టాలు పెట్టి నట్టేట్లో ముంచుతారు. ఆ మహామహులకు దూరంగా ఉండటమే భద్రం.

అలాంటవా రి ప్రాభావ వైభవాలను చూచి నాబోటిగాళ్ళు అసూయపడుతూ ఉంటే, మమ్మల్ని చూచి అసూయపడేవా ళ్ళున్నారు. వాళ్ళకు మేము తక్కువ. మాకు వీళ్ళు తక్కువ!

అలా పల్లెటూళ్ళల్లో చాల సంవత్సరా లున్నాము. ఆ రోజుల్లోనే మాకు ఇద్దరు పిల్లలు పుట్టారు. పసిబిడ్డల పెంపకాన్ని గురించి మాకే మనుభవం ఉంది గనుక! వాళ్ళ కేదయినా జబ్బు వస్తే వాళ్ళ ముందు దిగాలుపడి కూర్చొనే వాళ్ళం. పుల్లమ్మ, ఎల్లమ్మ చెప్పే చిట్కా మందులు పోస్తూ, గాలిలో దీపం పెట్టి దేవుడా నీ భారం అని కూచునే వాళ్ళం. అంతకుమించి వైద్య సౌకర్యం ఉండదు పల్లెల్లో. వాళ్ళ ఆయుర్దాయం గట్టిది గాబట్టి బ్రతికి బట్ట కడుతున్నారు.

కష్టం వచ్చినప్పుడు ప్రతి విషయానికీ శ్రీమతి నన్ను చాలా హింసించేది. నా చేతగానితనానికి దుమ్మెత్తి పో సేది. ఏదయినా పెద్ద ఊరికి-కాస్త



బస్సు సౌకర్యముండే ఊరికి వేయించుకోమని వేధించేది. నా కంటె వెనక ఉద్యోగంలో చేరిన వాళ్ళు నాకంటె మంచి ఊళ్ళల్లో ఉన్న నిజాలు వెలికి గ్రక్కేది.

"నువ్వూ ఏదయినా ఉద్యోగంలో ఉంటే బాగుండేది పద్మా! భార్యా భర్తల్ని ఒక్కచోట ఉంచాలనే జీ. వో. ఉంది. నువ్వు ఏదయినా టౌన్లో ఉద్యోగం చేస్తూ ఉంటే ఎలాగయినా పోరాడి నిన్ను చేరుకునే వాడిని. ఉద్యోగం చెయ్యని భార్యలు గల భర్తలకు ఇదే గతి" అన్నా న్నే నొకసారి.

ఏడ్చినట్లే ఉంది నంబడం. నేను ఉద్యోగంలో ఉంటే మిమ్మల్ని చేసుకునేదాన్నా ఏంటి" అంటూ నవ్వింది.

"కనీసం ఆ చేసుకున్న వాడికయినా వేడినీళ్ళ లా ఉపయోగపడేదానివిగదా అని నా బాధ."

"ఈ చిల్లుల గుడి సెల్లో నేనుమాత్రం మీకు వేడినివ్వటంలేదూ!" చిలిపి చూపులు చూస్తూ అనం'ఠో 2.

మాబాధల గురించి ఎప్పుడు మాట్లాడుకున్నా ఇదే వరస. ఫామిలీ ప్లానింగు చేసుకున్నామగాబట్టి సరిపోయిందిగాని లేకపోతే పల్లె కిద్దరు చొప్పున పిల్లల్ని కని ఉండేవాళ్ళం! పంతుళ్ళకు సంతు ఎక్కువ అంటే కాదామరి!

నానా అవస్థలు పడుతూ అలా పదిహేనేళ్ళు పల్లెటూళ్ళల్లో గడిపాము. ఏ దేవుడి దయ మా మీద ప్రసరించిందో ఏమో నన్నో పెద్ద ఊరికి బదిలీ చేశారు. ఆర్డరు చేతికందిన రోజు మేమెంత సంబరపడ్డామో! ఇంట్లో పండగ చేసుకున్నాము.

** ** **

కొత్త ఊరికి చేరకముందే మిత్రుల సాయంతో ఇల్లు చూచాను. కొత్తగా కట్టారు. మూ డు గదుల డాబా ఇల్లు. ఇంటికి ముందూ, వెనుకా ఖాళీ స్థలం. చూడ ముచ్చటగా బొమ్మరిల్లు లాగా ఉంది. మాకు చక్కగా సరిపోతుంది.

పూరి గుడి సెల్లో ఉండి వి "సిగి వేసారిపోయిన మాకు ఆ ఇల్లు తాజమహల్లా కనిపించటంలో ఆశ్చర్యం లేదు.

ఇంటి విషయమంతా పద్మకు వర్ణించి చెప్పాను. పల్లె వదిలి పట్నానికి పోతున్నాము. పూరిపాకల బతుక్కు వీడ్కోలు చెప్పి డాబా ఇంట్లోకి చేరబోతున్నాము. పద్మ ఆనందానికి అవధు ల్లేక పోయాయి.

మూ టా ముల్లే సర్దుకొని జాయినింగు టైము కూడా పాడుకోకుండా కొత్త ఊళ్ళో వచ్చి వాలాము.

మేము ఇంట్లో చేరింది జూన్ నెలలో. ఆగస్టులో వర్షాలు ప్రారంభమయ్యాయి. పెద్ద వర్షాలు కురవటం మొదలయ్యేసరికి మాతాజమహల బండారం బయట పడింది. ఇంటి కప్పు సరిగా వెయ్యలేదు కాబోలు ఇల్లంతా ధారాపాతంగా కురుస్తున్నది. పూరి కొంపలో వాన వెలవంగనే ఇంట్లో చుక్కలు పడవు. దీంట్లో వాన వెలి "సిన మూ డు నాలుగు గంటలయినా ఇల్లంతా కురుస్తూనే ఉంటుంది.

"రామేశ్వరం పోయినా శనేశ్వరం వదలలేదనీ..." పద్మ దీర్ఘాలు మొదలయ్యాయి."కంతల గుడి సెల్లో కుమిలిపోయి ఇక్కడి కొచ్చినా అంతే. ఏం చేస్తాం! ఎవరి ముఖాన ఎంత రా "సి ఉంటే అంత జరుగుతుంది. చేసుకున్న వారికి చేసుకున్నంత. పుణ్యం కొద్దీ పురుమడు, దానం కొద్దీ బిడ్డలు అన్నారు. నా పుణ్యం ఇలా ఏడ్చింది..."

ఇది వరస.

ఆకాశంలో మబ్బులు కనబడితే చాలు నాకు శాపనార్థాలు మొదలవుతాయి. ఆ ఇల్లు అలాంటిదని నేను మాత్రం అనుకున్నానా! తాను మాత్రం చూచి మురి "సి పోలేదూ?

సర్వ స్వతంత్రంగా తిట్టేందుకు, ప్రేమించేందుకు భార్యకు భర్త మీదేగా హక్కు. ఆమె వాగ్ధాటికి కిక్కురు మనకుండా ఉండి పోయేవాడిని.

మంచి ఇల్లు కావాలని కోరుకున్నన్ని రోజులు పట్టలేదు దానిమీద మోజు తీరిపోయేందుకు!

రోజులో చాలా భాగం బయటనే గడిపే సే నాకు ఇంతటి ఆవిడ పడుతున్న బాధ అర్థం కావటం లేదని ఆవిడ ఏడుపు. ఇంటి వారితో మాట్లాడి దాన్ని బాగు చేయించకుండా తాత్సారం చేస్తున్నానని నాతో తగూ పెట్టుకుంటుంది. నా అసమర్థతను దుమ్మెత్తి పోస్తుంది. కన్నీళ్ళు కారుస్తుంది.

ఇంటివాళ్ళతో చాలా సార్లు చెప్పాను. లేడి కంటికి నీరు గారితే వేటగాడికి జాలి కలుగుతుందా! అదిగో ఇదిగో అంటూ శుష్క వాగ్దానాలు నమ్మి ఓటరు మహాశయులు ఓట్లు కుమ్మరించి "సినట్లు... నేను నెల నెలా శక్తికి మించిన మొత్తమైనా యజమానులకు చెల్లిస్తున్నాను. సమస్యలు తీరితే ప్రజలకు తమతో పని ఉండదని నాయకుల బాధ. ఇల్లు బాగుపడితే అద్దె పనూలు చేసుకుందుకు తానే నన్ను వెదుక్కుంటూ రావాల్సొస్తుందని మాయజమాని బాధ. ఏదో చేస్తామని, ఏమీ చెయ్యకుండా తడిపి పెడుతున్నారు.

నా అదృష్టం బాగుండి విద్యాశాఖ వారు ఓరియంటేషన్ ట్రెయినిం గంటూ ఆహ్వానించినవారి జాబితాలో నా పేరుకూడా ఉంది. అక్కడ నేను నేర్చుకునేది, వారు చెప్పేది ఏమీ ఉండదు. ఎందుకో ఏదో కార్యక్రమన్ని రూపొందిస్తారు. దాన్ని అమలు పరిచామని ఆత్మ తృప్తి చేసుకోవటానికి ఏదో చేస్తారు. వారాడించినట్లు ఆడటమే మాపని!

ఏమయితే ఏమి- ఇంటి పోరునుంచి నా కిదో మంచి ఎ స్కేప్. వారం రోజులు ప్రభుత్వ అదనపు ఖర్చుతో దిగులూ, చింతా లేకుండా గడిపెయ్యవచ్చును.

పద్మకు చెప్పాల్సిన జాగ్రత్తలు చెప్పి ద్విగుణీకృతోత్సాహంతో బయల్దేరి పోయాను.

×× ×× ××

"ఇంజినీరుగారి భార్య మొన్న "సినిమాలో కనిపించిందండీ. ఎంత మంచిదో ఆమె. గర్వం అవగింజలో నూరోవంతయినా లేదండీ."

నేను ఊరినించి తిరిగి వచ్చిన రాత్రి పద్మ మొదలు పెట్టింది. అంత గొప్పింటి పడుచుతో మాట్లాడానన్న గర్వం ముఖంలో తొణికిస లాడుతున్నది. తలలో పూలు, ముఖానికి రాసుకున్న మంచి గంధపు పొడరు కమ్మని సుగంధాన్ని వెలువరిస్తున్నాయి. వారం రోజుల విరామంవల్ల పద్మ కొత్త పెళ్ళికూతుర్లా కనిపిస్తున్నది. నిజంగా కొత్త పెళ్ళి కూతుర్లాగే సయగారాలు పోయింది పిల్లల్ని నిద్ర పుచ్చి.

ప్రియంగా దగ్గరికి తీసుకుని ఆమె చెంపలు నిమురుతూ, "ఏ ఇంజనీరుగారి భార్య, పద్మా!" అన్నాను.


"ఏ ఇంజనీ రేంటండీ! ఊరికి పదిమంది ఇంజనీ ర్లుంటారా బడి పంతుళ్ళలాగా! ఈ ఊళ్ళో ఉన్నది ఒక్క ఇంజనీరే. ఆయనగారి భార్య మాటే నేను చెబుతున్నది."

పద్మ విశాలనేత్రాలను మరింత పెద్దవి చేస్తూ మాట్లాడుతుంటే పాపయ్యశా(స్త్రిగారి 'అంజనరేఖ వాల్గన్నుల అంచుల దాక...' పద్యం జ్ఞాపకం వచ్చి ఆనందానుభూతి పొందుతున్నాను.

"ఆమె ఎంత బాగా మాట్లాడిందో! మెడనిండా బంగారం. వజ్రాల కమ్మలు. రాళ్ళ గాజులు. దేవతా విగ్రహంలా ఉందంటే నమ్మండి. "సినిమా హాల్లో నా పక్కనే కూచున్నది."

"వాళ్ళ కేం, పద్మా! వాళ్ళ చుట్టూ మనుమలు తిరుగుతారు." యాదాలాపంగానే అన్నాను.

పద్మ ఆవిడ అంద చందాలను, కలుపుగోలుతనాన్ని, ఆభరణాల సౌభాగ్యాన్ని వర్ణించి చెబుతున్నది. బంగారం చూచేందుక్కూడా స్తోమతు లేదు చాలామందికి. పద్మ ఆభరణాలను చూచి మోజు పడుతున్న దేమో అనుకున్నాను. ఆ మాటలే బయటికి కనేశాను.



"అయ్యో రామ! బంగారం మాటవ రెత్తారండీ ఇప్పుడు. ఇన్ని రోజుల సంసార జీవితంలో మిమ్మల్ని అలాంటి కోర్కె లెప్పుడన్నా కోరానా?" బుంగ మూ తి పెట్టింది పద్మ.

"ఇంతకూ ఏం మాట్లాడిందో చెప్పావు కాదు మరి."

"వాళ్ళ ఇంట్లో ఒక వాటా ఖాళీగా ఉందిటండీ. వాళ్ళూ మన వాళ్ళే. బాగా కలివిడిగా ఉండవచ్చును. ఆవిడ ఎంతో ఇదిగా చెప్పిందండీ. మీరు వ స్తే తప్పక సెటిల్ చేయిస్తా నన్నది."

"అద్దె ఎక్కువగా ఉంటుంది, పద్మా! మనం భరించలేము." పక్కకు ఒత్తిగిల్లాను అనంగీకార సూచకంగా.

"మనం ఇప్పు డిచ్చేకంటే ఇరవయ్యే నండి ఎక్కువ. వాళ్ళబ్బాయికి ట్యూషను చెప్పాలిట. వాళ్ళిచ్చే ఇరవయితో అది సరిపోతుంది. ఇక ఈ ఇంట్లో నేను ఒక్క క్షణంకూడా ఉండలేను" అంటూ ఆ ఇంటిని తిట్టి పోసింది.

"అద్దెకూడా కుదిర్చేశా వన్నమాట."

"ఆవిడే వెంట తీసుకుపోయి ఫలహారం కాఫీ ఇచ్చి, ఇల్లు చూపించిందండీ. ఎంత బాగుందో. బలే సౌకర్యంగా ఉంటుంది." ఎంతో ఇదవుతూ చెప్పింది పద్మ.

నే నేమీ మాట్లాడలేదు. ఇంజనీరుగారి పక్కన నేను సూర్యుడి ముందు కిరసనాయిలు బుడ్డీలా. నా మన సంగీకరించటం లేదు.

పద్మ ఒత్తిడి ఎక్కువయింది. ఒకసారి ఆవిడగారు స్వయంగా మా ఇంటి కొచ్చి అడిగి పోయిందట- ఎప్పుడు చేర్తారని. దాంతో పద్మ ఆరాటం తారస్థాయి నందుకున్నది. ట్యూషను చెప్పటం నా ఆదర్శానికి విరుద్ధమే అయినా, ఒప్పుకోక తప్పింది కాదు. చిట్ట చివరి అస్త్రంకూడా వృథా పోయింది.

"అంత పెద్ద ధనవంతుల పక్కన మనం ఉండటం మంచిది కాదు ,పద్మా! వాళ్ళకు ఫోము సోఫాలు, కుర్చీలు, ఫాన్లు, ఫ్రిజులు ఎన్నో ఉంటాయి. మన కేమున్నాయి- పాత డబ్బాలు, అల్యూమినం పాత్రలు. చిరిగిన చాపలు తప్ప. అవి అన్ని సొమ్ములు అలంకరించుకొని ఉంటే, పక్కనే బోసిపోతూ చెలికత్తెలా కనిపిస్తావు, నీవు! నీ కిలా ఉన్నా చూచేందుకు నాకు బాగుండదు" అన్నాను.

ఆవిడ ఏమి నూరి పోసిందో, ఏమో... పద్మ నా మాటలకు సుతరాము ఒప్పుకోలేదు. ముక్కుపుటా లెగరేస్తూ కళ్ళనిండా నీళ్ళు నింపుకొని మీ రన్నిటికీ ఇంతే నే నడిగింది ఎప్పుడు ఒప్పుకున్నారు గనక?" అంటూ ముఖారిరాగాలాపన ప్రారంభించింది.

"వచ్చే ఆదివారం ఖచ్చితంగా చేర్తామని ఆమెకు మాటిచ్చాను. ఇక ఈ ఇంట్లో చ స్తే ఉండను" అంటూ ఖరా ఖండిగా చెప్పేసింది- తాంబూలాలు పుచ్చుకున్నాం తన్నుకు చావండి అని అగ్నిహోత్రావధా న్లన్నట్లు.

×× ×× ××

ఇంజనీరుగారి ముద్దుల కొడుకు మా స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు.

ఆ స్కూలొక మహా సముద్రం. నా పనేదో చేసుకొని ఇంటికి రావటం నా కలవాటు. ఆ పిల్లవాడిని గురించి నా కేమీ తెలీదు.

పద్మే చెప్పింది ఆ తల్లిదండ్రులు కొడుకును ఎంత గారాబంగా పెంచుతున్నారో. మా పిల్లల్ని మే మలా పెంచలేక పోతున్నందుకు ఎంతో వాపోయేది. ఆ పిల్లవాడి చురుకుదనం, సుకుమారత్వాల గురించి చాలానే చెప్పింది.

పద్మ, ఇంజనీరు భార్యగారు పాలూ, నీళ్ళలా కలిసిపోయారు. వంటకాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటాలు, కలిసి సినిమా చూడటాలు, కాలక్షేపం చెయ్యటాలు ఎక్కువయినాయి.

ఇంజనీరుగా రబ్బాయి పూలుబంతిలా అందంగా, ముద్దుగా ఉంటాడు. చదువులో మాత్రం శూన్యం. ముందుకు చేర్చుకున్నందుకు పరిహారంగా నోట్సులు రాసి పెటట్టం వాటిని చదివి పెట్టటం వగయిరా పనులు చాలా శ్రద్ధగా నే చేశాను. పాపం ఆ పిల్లవాడికి తిండిమీద, ఆటలమీద ఉన్న ఆసక్తి చదువుమీద లేదు.

పరీక్ష లొచ్చాయి. అంటే చదువుల రామాయణంలో కిష్కింధ కాండ అన్నమాట. కాపీలు, బోర్డుమీద రాయటాలు, వగయిరాలు జోరుగానే సాగాయి. పరీక్షలు అయిపోయాయి. ఆ తరవాత-

పద్మకు ఆమె స్నేహితురాలికి ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభమయింది. ఒకరి పొడ ఒకరికి గిట్టకపోవడం, ఉమ్మడిగా ఉన్న నీటి పంపు ఆవిడగారే సొంతం చేసుకోవటం వగయిరాలు జరుగుతున్నాయి.

పరీక్షా ఫలితాలు వెలువడటం, నా ప్రయివేటు శిష్యుడు ఫెయిలవటం జరిగిపోయాయి.

ఇరుగు పొరుగుల ప్రచ్ఛన్నయుద్ధం ప్రత్యక్ష యుద్ధంగా మారటానికి ఎన్నో రోజులు పట్టలేదు.

×× ×× ××

ఇప్పుడు నా సమస్య ఇల్లు మార్చటం కాదు. ఇప్పుడు పద్మ ఏ ఇంటితో నయినా సరిపెట్టుకుంటుంది.

చదువుకున్న తల్లిదండ్రులుకూడా తమ పిల్లలకు అక్షరమ్ముక్క రాకపోయినా పై తరగతులకు ఎగబ్రాకాలని ఎందుకు ఆరాట పడుతున్నారు?

తమ బిడ్డల భవిష్యత్తు కోసం దేశానికి గోతులు తవ్వితే ఎలా!

*

రసవద్ఘట్టాలు:

## సస్య శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్

**లోక విఖ్యాత** వృక్ష శాస్త్రవేత్త ఆచార్య జగదీశ చంద్రబోసు. ఇంటర్నేషనల్ ఇంటెలిజెన్స్ కో-ఆపరేటివ్ కమిటీ సభ్యుడుగా బోసు ప్రతి ఏటా భార్య అబాలాదేవితోపాటు జెనీవా వెళ్ళి వస్తుండేవాడు. యూరోప్ రాకపోకల సందర్భంగా బొంబాయిలోని ప్రముఖ జాతీయవాది విఠల్ చందావర్కర్ ఇంట్లో బస చేసేవాడు.

ఒకమారు బొంబాయికి చేరువగా ఉన్న కార్లే గుహలను చూడాలని చందావర్‌కర్ కుమారునితో పాటు బయలుదేరారు.

రైలు ఖాండ్లా సొరంగమార్గం దాటి స్టేషన్‌లో ఆగింది. తినుబండారాలు అమ్ముకుంటూ కేకలు వేస్తున్నారు. ఇద్దరు ఆదివాసి స్త్రీలు అడవిలో కాచే పళ్ళు అమ్ముకుంటూ బోసు దంపతులు కూర్చున్న పెట్టె వద్దకు వచ్చి పళ్ళు చూపించారు. అబాలాదేవికి వారి భాష అర్థం కాలేదు.

బాగా మగ్గిన పళ్ళు తియ్యగా ఉంటాయి అని తెలుసుకున్న అబాలాదేవి పళ్ళను కొన్నది.

బోసు బాబు పళ్ళ పొట్లం విప్పి రెండు పళ్ళను నోట్లో వేసుకోబోతూ ఉండగా అబాలాదేవి ఆ పొట్లాన్ని అమాంతంగా లాక్కొన్నది. ప్రతి పండును రుచి చూసి ఉమ్మివేస్తున్న దామె.

యువ చందావర్‌కర్, "ఏమండి! పళ్ళు తియ్యగా లేవాండి?"

"లేకేం, తియ్యగా ఉన్నాయి కాబట్టే పారవేస్తున్నాను."

"తియ్యగా ఉంటే పారవేయడ మెందుకు?"

అందుకు సమాధానంగా ఆమె—"ఆచార్యజీ! తీపి పదార్థాలను తినకూడదని డాక్టర్ల ఆదేశం. వారికి మతిమరుపు ఎక్కువ. వారు అంతగా కావాలంటే పుల్లని పళ్ళు ఇస్తాను."

"పోనీ మీరైనా తినవచ్చు కదా!"

"ఆచార్యజీ తినకూడని పళ్ళను నేనుమాత్రం ఎలా తింటాను! వైద్యులు ఆ విధంగా మావారిని ఆదేశించింది మొదలు, నేనుకూడా తీపి పదార్థాలను విసర్జించాను" అన్న దామె.

** ** **

ఆచార్య బోసు బొంబాయి వచ్చినప్పుడల్లా ఎందరో మిత్రులు, అభిమానులు వారి దర్శనంకోసం వచ్చేవారు. ఒక సాయంత్రం మల్‌రాజ్ ఖటావ్ అన్న ప్రముఖ వ్యాపారి బోసుగారి దర్శనంకొరకు వచ్చాడు. చందావర్‌కర్ కుమారుడు మేడపై గదిలో విశ్రాంతి తీసుకుంటున్న బోసుబాబు గదిలోనికి వెళ్ళి ఖటావ్ రాకను గురించి చెప్పాడు. పడకపై విశ్రాంతి తీసుకుంటూ బోసుబాబు చదువుతున్న పుస్తకాన్ని పడకపై ఉంచాడు. ఆ పుస్తకం బాలలను అమితంగా ఆకర్షించే 'ఆలిస్ ఇన్ వండర్‌లాండ్!'

** ** **

ఒకసారి ఓ సాముద్రిక శాస్త్రవేత్త బోసుబాబును సమీపించి, "అయ్యా! మీ చేయి ఓ మా రిలా ఇవ్వండి. మీ భవిష్యత్తు చెబుతాను" అన్నాడు.

బోసుబాబు చికాకుతో-"అయ్యా! వెళ్ళి రండి" అన్నాడు.

అక్కడే ఉన్న అబాలాదేవి కేమో కుతూహలం. సాముద్రిక శాస్త్రజ్ఞుని పిలిచి కాస్త ఎడంగా కూర్చుని చేయి చూపించింది. బోసుబాబు మిత్రులతో మాట్లాడుతూ ఉన్నారు.

"అమ్మా! మీ రెంతో పుణ్యాత్ములు. ముత్తయిదువుగా తనువు చాలిస్తారు" అన్నాడు.

ఆ మాటలు విన్నంతనే-"నాన్ సెన్స్, నేను బ్రతికుండగా అమె మరణించడం అసంభవం. ఆమె చనిపోయిన తర్వాత నేను ఒంటరిగా ఎలా జీవిస్తాను?" అన్నారు బోసుబాబు.

ఆచార్య బోసు 1937లో దివంగతు లయ్యారు. అబాలాదేవి పదునాలుగేళ్ళ తర్వాత 1951లో కన్నుమూసింది. సాముద్రిక శాస్త్రజ్ఞుని భవిష్యం నిజమయింది.

-జానమద్ది హనుమచ్ఛాస్త్రి